క్లుప్తంగా

తాడేపల్లి తహసీల్దార్‌గా సీతారామయ్య



తాడేపల్లిరూరల్: తాడేపల్లి కొత్త తహసీల్దార్‌గా డి.సీతారామయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను డెప్యూటీ తహసీల్దార్ సతీష్, అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సీతారామయ్య గతంలో బాపట్ల కలెక్టర్ కార్యాలయంలో కో–ఆర్డినేషన్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేశారు. అంతకు ముందు గిద్దలూరు, కందుకూరు, అద్దంకి, సత్తెనపల్లి ప్రాంతాల్లో విధులు నిర్వర్తించారు.

పోషకాహారంతోనే రక్తహీనత నివారణ



ఫిరంగిపురం: గర్భిణులు పోషకాహారం తీసుకోవడం వల్ల రక్తహీనత తొలగుతుందని వైద్యురాలు ఫరీనాబేగం చెప్పారు. నుదురుపాడు పీహెచ్‌సీలో ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ యోజన ద్వారా తొమ్మిది గ్రామాల నుంచి వచ్చిన 39 మంది గర్భిణులకు వైద్యపరీక్షలు చేశారు. ఫరీనాబేగం మాట్లాడుతూ గర్భిణులు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. గర్భిణులకు రక్తహీనత నివారణ మాత్రలు అందిస్తున్నట్టు వివరించారు. ప్రభుత్వ వైద్యశాలలోనే కాన్పు జరిగేలా అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు.

సాఫ్ట్‌వేర్‌తోపాటు కోర్ సెక్టార్‌లో అద్భుత ఉద్యోగావకాశాలు



మోతడక(తాడికొండ): సాఫ్ట్‌వేర్‌తోపాటు కోర్ సెక్టార్‌లో అద్భుత ఉద్యోగావకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకునేందుకు విద్యార్థులు కృషి చేయాలని విశిష్ట ఇన్నోవేటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.సందీప్ చెప్పారు. మంగళవారం మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం ఐఈటీఈ స్టూడెంట్ ఫోరం ఆధ్వర్యంలో పీసీబీ డిజైన్ అండ్ ఫ్యాబ్రికేషన్ అనే అంశంపై నాలుగు రోజుల వర్క్‌షాప్ మంగళవారం ప్రారంభించారు. వర్క్‌షాప్‌లో ఫ్యాబ్రికేషన్, అసెంబ్లింగ్ వంటి అంశాలపై శిక్షణ ఇస్తామని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.నాగశ్రీనివాసరావు, ఆర్‌అండ్‌డీ డీన్ డాక్టర్ బాల మురళీకృష్ణ, విభాగాధిపతి డాక్టర్ రవికిరణ్, అకడమిక్ డీన్ డాక్టర్ ఫణికుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి అభినందన



తాడేపల్లిరూరల్ : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న నులకపేట మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల (ఉర్దూ) ఫిజికల్ సైన్స్ టీచర్ షేక్ షాహిద్ అలీని మంగళవారం ఉండవల్లిలోని ఎంపీయూపీ పాఠశాలలో సత్కరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన తెనాలి డెప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ గరిక శాంతకుమారి మాట్లాడుతూ అలీ సేవలను కొనియాడారు. మండల విద్యాశాఖ అధికారి డి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకున్న షాహిద్ అలీ మరిన్ని అవార్డులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు షాజీర్, మండలంలో వివిధ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొని షాహిద్ అలీని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

మహానాడులో పర్యటన



తాడేపల్లిరూరల్: మహానాడు ప్రాంతంలో ముంపునకు గురైన ప్రాంతాన్ని తాడేపల్లి తహసీల్దార్ డి.సీతారామయ్య మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామని, వరద బాధితులను గుర్తిస్తున్నామని వివరించారు. నష్టపరిహారం అంచనా వేసిన అనంతరం ప్రభుత్వ నిబంధనల మేరకు నివేదిక పంపిస్తామని చెప్పారు. రెవెన్యూ సర్టిఫికెట్లు, సంబంధిత సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వెల్లడించారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ సతీష్‌కుమార్, వీఆర్వోలు, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

‘దారి’కాచిన కష్టాలపై స్పందన



దోకిపర్రులో రోడ్డుపై ఉన్న బురదను పొక్లెయిన్ సాయంతో తొలగిస్తున్న దృశ్యం



సాక్షి ఎఫెక్ట్

మేడికొండూరు/ఫిరంగిపురం: వరదకు దెబ్బతిన్న రోడ్ల దుస్థితిపై మంగళవారం సాక్షి దినపత్రికలో ‘దారి’కాచిన కష్టాలు శీర్షికన ప్రచురితమైన ఫొటో ఫీచర్‌కు అధికారులు స్పందించారు. మేడికొండూరు మండలం డోకిపర్రు రోడ్డుపై నిలిచిన మురుగు, బురదను పొక్లెయిన్ సాయంతో తొలగించి శుభ్రం చేశారు. అలాగే ఫిరంగిపురం మండలం కండ్రిక వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతినడం, నుదురుపాడు అడ్డరోడ్డు వద్ద బురదమయంగా మారడంపై పంచాయతీ రాజ్ పర్యవేక్షక ఇంజినీర్ జి.బ్రహ్మయ్య స్పందించారు. ఈ రోడ్డును అభివృద్ధి చేసేందుకు ఎస్డీఆర్ఎఫ్ గ్రాంటు నుంచి రూ.4 లక్షలు మంజూరయ్యాయని, మరో రూ.40 లక్షల గ్రాంటు కోసం ప్రభుత్వానికి నివేదిక పంపామని పేర్కొన్నారు. మేడికొండూరు మండలం డోకిపర్రు, తురకపాలెం, మంగళగిరిపాడు మీదుగా మేడికొండూరు వెళ్లే రహదారి అభివృద్ధి కోసం రూ.కోటి ఎఫ్‌డీఆర్ గ్రాంటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని వివరించారు. నిధులు రాగానే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

గణనాథునికి పూజలు



ఫిరంగిపురంలో గణనాథుడిని ఊరేగిస్తున్న కాకతీయ యూత్ సభ్యులు.



విశేష అలంకారంలో గజాననుడు

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో చవితి పందిళ్లలో కొలువైన గణపతి విగ్రహాలకు నాలుగోరోజు మంగళవారం భక్తులు విశేష పూజలు చేశారు. వేదపండితులు అష్టోత్తర, సహస్రనామ పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఫిరంగిపురంలోని విజయదుర్గా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పందిరిలో గణపతికి విశేషపూజలు చేశారు. శాంతి ల్యాబ్ వద్ద వినాయకుడికి భక్తులు పూజలు చేశారు. ప్రసాదాలు పంపిణీ చేశారు. ఫిరంగిపురంలోని సొలస బస్టాండు సెంటర్లో కాకతీయ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహానికి మూడు రోజులుగా పూజలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై ఉంచి మేళతాళాలతో గ్రామంలో ఊరేగించారు. నిమజ్జనానికి అమరావతికి తీసుకువెళ్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు యత్నించండి



మాట్లాడుతున్న ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శ్రావణ్‌బాబు

తెనాలిఅర్బన్: మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు అందరూ ప్రయత్నించాలని జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం విభాగం ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పి.శ్రావణ్‌బాబు సూచించారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం విభాగం ఆధ్వర్యంలో జెఎంజె కళాశాలలో మంగళవారం అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపత్కర సమయంలో యువత భావోద్వేగానికి గురికావదన్నారు. క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు ఇబ్బందులు గురి చేస్తాయని చెప్పారు. మానసిక స్థైర్యాన్ని అందరూ కలిగి ఉండాలన్నారు. పవర పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఆత్మహత్యలు పేరేపించే అంశాలు, వారి ప్రవర్తనను విజ్ఞాన్ లారా యూనివర్శిటీ సైకాలజీ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శంకర్ మండల్ తెలియజేశారు. కార్యక్రమంలో గిరిధర్, డాక్టర్ పి.హేమలత, కె.శ్రావణి, చిన్న బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

పీసీఓడీ సమస్యలపై అవగాహన కలిగి ఉండాలి

డాక్టర్ షమా సల్తానా



డాక్టర్ షమా సుల్తానాను సన్మానిస్తున్న కాలేజ్ యాజమాన్యం

గుంటూరు మెడికల్: ఆధునిక జీవనశైలి వలన యువత పీసీఓడీ సమస్యలను ఎదుర్కొంటున్నారని ప్రముఖ గైనకాలజిస్ట్, హోప్‌విన్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ షమా సుల్తానా అన్నారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాలలో హిందీ విభాగం, ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినులకు పీసీఓడీ సమస్యలపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. డాక్టర్ షమా సుల్తానా మహిళలు మానసిక ఒత్తిడి, ఆందోళన, శారీరక శ్రమ లేకపోవటం, పాశ్చాత్య జీవన విధానానికి అలవాటు పడటం, హార్మోన్స్‌లో తేడాలు, పోషకాహార లోపం, కొవ్వు పదార్థాలు, జంక్‌ఫుడ్స్ ఎక్కువ తీసుకోవటం, సరిపడా నిద్రలేకుండా రాత్రి వేళ్లలో ఎక్కువ సమయం సెల్‌ఫోన్స్, కంప్యూటర్స్ ముందు గడపటం వంటి కారణాలతో పీసీఓడీ సమస్య వస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమస్యను ప్రాథమిక దశలోనే గుర్తించి మందులు వాడి జీవన విధానంలో మార్పులు చేసుకుంటే సమస్యలు ఉండవని చెప్పారు. పీసీఓడీ సమస్యలపై విద్యార్థినులకు సందేహాలు నివృత్తి చేశారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ షమా సుల్తానను శాలువా కప్పి మెమెంటోతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పీఎం ప్రసాద్, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి.వేణుగోపాల్, ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్ వి.బ్యూలా రాణి, హిందీ విభాగం అధ్యాపకులు షేక్ బాజీ, డాక్టర్ ఎస్ వి ఎస్ గిరిజ, డాక్టర్ కె. లక్ష్మమ్మ, సిహెచ్. అరుణ, షేక్ హసీన, హోప్ విన్ హాస్పిటల్స్ మేనేజర్ పి. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రీసెర్చ్ సెల్ ఆధ్వర్యంలో సదస్సు

ఏఎన్‌యూ: నాగార్జున విశ్వవిద్యాలయ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం బయో ఈ –3 అంశంపై సదస్సు నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన వికసిత్ భారత్ 2047లో భాగంగా బయో ఈ –3 (బయోటెక్నాలజీ ఫర్ ఎకానమీ, ఎన్విరాన్మెంట్, ఎంప్లాయిమెంట్) పాలసీలు, జీవ ఉత్పత్తి పెంపొందించుట, అమృతకాలం నెరవేర్చే లక్ష్యంతో ఈ సదస్సు నిర్వహించామని సదస్సు డైరెక్టర్, రీసెర్చ్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుధాకర్ తెలిపారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా సీడీఎఫ్‌డీ శాస్త్రవేత్తలు ఎం.సుబ్బారెడ్డి, డాక్టర్ యతీస్ ఆచార్, డాక్టర్ మధుసూదన్ రెడ్డి హాజరయ్యారన్నారు. బయో ఈ – 3 పాలసీలను విద్యార్థులకు పరిశోధకులకు అతిథులు వివరించారు. భవిష్యత్తులో బయో ఈ – 3 వల్ల ఉపాధి అవకాశాలు ఉంటాయని వాటి ద్వారా ఆర్థిక అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణలో యువత భాగస్వాములు కావాలని సూచించారు.

రైతులను ఆదుకోవాలి



తాడేపల్లిరూరల్: వరదలు, వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు కోరారు. మంగళవారం తాడేపల్లిలోని రైతు సంఘం కార్యాలయంలో దండమూడి సాంబశివరావు అధ్యక్షతన రైతు సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా శివశంకరరావు మాట్లాడుతూ వాణిజ్య ఉద్యానవన పంటలకు ఎకరాకు లక్ష రూపాయలు, వరి తదితర పంటలకు ఎకరాకు 30 వేల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులు, కౌలు రైతుల రుణాలు మాఫీ చేయాలని కోరారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేల పెట్టుబడి సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు రైతు సమస్యలపై సెప్టెంబర్ 12 నుంచి 16 వరకు అన్ని సచివాలయాల్లో వినతి పత్రాలు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాజధాని రైతు సంఘం అధ్యక్షులు కె.జగదీశ్వరరెడ్డి, బక్కిరెడ్డి, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, ఎస్‌కే యర్రపీరు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పండ్లు, పుస్తకాలు పంపిణీ



తెనాలిఅర్బన్: పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో యడ్లలింగయ్య కాలనీలోని ఎస్‌కెసీ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం యాపిల్స్, బ్రెడ్, పుస్తకాలు, పెన్సిల్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు ఎస్.అరుణకుమారి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు తాము చదివిన పాఠశాలలో సేవ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎంపీ పుష్ప, రాణి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



తెనాలిరూరల్: శాసనమండలి ఎన్నికలకు సంబంధించి పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ కేవీ గోపాలకృష్ణ మంగళవారం పరిశీలించారు. స్థానిక కొత్తపేటలోని దొడ్డపనేని ఇందిర మున్సిపల్ బాలికోన్నత పాఠశాల, గంగానమ్మపేటలోని తోటకూర సుబ్బారావు నాయుడు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, వెంటిలేషన్ వంటి సదుపాయాలను పాఠశాల ఉపాధ్యాయ బృందం ద్వారా తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్ఐ వి. జాన్, సీనియర్ అసిస్టెంట్ ఎస్. జగన్‌మోహన్‌రావు సిబ్బంది ఉన్నారు.

సున్నం చల్లి... చెత్త ఎత్తివేసి...



లంక గ్రామంలో చెత్తను తొలిగిస్తున్న కార్మికులు

- ముంపు గ్రామాల్లో చకచకా పారిశుద్ధ్యం పనులు
- వ్యర్థాల తొలగింపు ముమ్మరం



పాత బొమ్మువానిపాలెంలో బ్లీచింగ్ చల్లుతున్న పంచాయతీ కార్మికులు

కొల్లిపర: నిన్న మొన్నటి వరకు మండల పరిధిలోని లంక గ్రామాల్లో వరద ఉధృతి కారణంగా గ్రామంలో అనేక చోట్ల నీరు చేరటంతో చెట్ల, మట్టి, మురుగు పేరుకు పోవటంతో గత రెండు రోజుల నుంచి ఆయా గ్రామంలో వరదనీరు పూర్తిగా తగ్గటంతో ఎంపీడీవో వి.విజయలక్ష్మి వేగంగా పంచాయతీ కార్యదర్శుల ద్వారా పారిశుద్ధ్యంపై శ్రద్ధ పెట్టారు. పాత బొమ్మువానిపాలెం, అన్నవరపులంక, కొత్తూరు లంక గ్రామాలలో బ్లీచింగ్, నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్, దోమలకు మందులు పిచికారీ చేయించారు. వరద కారణంగా నిలిచిన చెట్ల, చెట్టుకొమ్మలు, వ్యర్థ పదార్థాలను తొలగించే కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ గ్రామంలో ఎక్కడైనా చెట్ల, మురుగు ఉన్న పక్షంలో తమ దృష్టికి తీసుకురావాలని గ్రామస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

వీరనారీ చాకలి ఐలమ్మ



ఐలమ్మ, గౌతు లచ్చన్న, వైఎస్సార్, వంగవీటి విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు



మంగళగిరిలో చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిరూరల్: జీవితాంతం ప్రజాపోరాటాలు చేసిన చాకలి ఐలమ్మ వీరనారీ అని పలువురు కొనియాడారు. ఆమె వర్ధంతిని మంగళవారం ఇప్పటంలోని సర్దార్ గౌతు లచ్చన్న, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కమ్యూనిటీ హాల్ వద్ద నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లభాపురం వెంకటేశ్వరరావు పాల్గొని చాకలి ఐలమ్మ, సర్దార్ గౌతు లచ్చన్న, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, వంగవీటి మోహనరంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శి బొజ్జ సుబ్బారావు, అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ కం ఇస్త్రీ దారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాగోలు శ్రీనివాసరావు, పిన్నెల్లి పద్మావతి, పిన్నెల్లి పద్మసుధ, కాశి, నాగవేణి, భూలక్ష్మి, బాజీ తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మకు నివాళి

మంగళగిరి: జీవితాంతం ప్రజాపోరాటాలు చేసిన వీర వనిత చిట్యాల (చాకలి) ఐలమ్మ సేవలు చిరస్మరణీయమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు కొనియాడారు. ఐలమ్మ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పారేపల్లి మహేష్, ఉప్పాల రాజ్‌కిరణ్ ,కాగితాల స్వాతి గౌడ్, కొమ్మాకుల విజయభాస్కర్, ఉడతా శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేళాంగిణి మాత జన్మదినోత్సవం



పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

తెనాలిరూరల్: వేళాంగిణి మాత జన్మ దినోత్సవాలను మండలంలోని అంగలకుదురులో ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి గ్రామంలోని ఆర్‌సీఎం చర్చి వద్ద పేదలకు బియ్యం, కూరగాయలు, గుడ్లు పంపిణీ చేశారు. చర్చి గురువులు శౌరిరాజు, మెరియో, సునీల్, ఉపదేశకులు పి. బాలస్వామి, రాజమోహన్, సీహెచ్ బాలస్వామి, జ్ఞానమేరి, సంఘపెద్దలు, విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు అరికట్టాలి



శిరీషను పరామర్శిస్తున్న నాయకులు

తెనాలిఅర్బన్: రాష్ట్రంలో దళితులపై దాడులు రోజు రోజుకు పెరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఉన్నం ధర్మారావు మాదిగ డిమాండ్ చేశారు. తెనాలి జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతున్న మున్నంగి గ్రామానికి చెందిన దళిత మహిళ బొంతు శిరీషను మంగళవారం ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కూచిపూడి కిరణ్, ఉన్నం భరత్, ఉన్నం ఇమ్మానియేల్, కారుమూరి చంటి, ఉన్నం గోపి, ఉన్నం సన్నీ, ఉన్నం నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

మెడికల్ విద్యార్థిని దత్తత తీసుకోవటం అభినందనీయం



విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు తదితరులు

గుంటూరు రూరల్: దళిత పేద మెడికల్ విద్యార్థినిని దత్తత తీసుకుని తన విద్యాభివృద్ధికి సాయం అందించడం అభినందనీయమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు తెలిపారు. గోరంట్ల గ్రామంలోని మల్లికార్జునపురంకాలనీలోని మీ శ్రేయోభిలాష స్వచ్ఛంద సేవా సంస్థలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గోరంట్ల గ్రామానికి చెందిన బిరుదు హాదస్సాకి కాకినాడలోని రంగనాయకులు మెడికల్ కళాశాలలో సీటు రావటం జరిగిందని, కానీ విద్యార్థిని పేదరికంతో చదువుకోలేని పరిస్థితిలో ఉండటంతో ఆమె గురించి తెలుసుకున్న మీ శ్రేయోభిలాష స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు నారా జోషి, అనుపమ దంపతులు విద్యార్థి విద్యాభివృద్ధికి కృషిచేయాలని ఆర్థిక సాయం చేయటం అభినందించదగిన విషయమన్నారు. అదేవిధంగా విద్యార్థి మెడిసిన్ పూర్తయ్యే వరకు వారే పూర్తి బాధ్యత వహిస్తామని హామీ ఇవ్వటం జరిగిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే చేతులమీదుగా మొదటి విడతగా రూ.29 వేల చెక్కును విద్యార్థికి అందజేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బాలాజీ, సంస్థ సభ్యులు ఎస్ఎన్ మీరా, సి.కృష్ణారావు, సురేష్, మాధవరెడ్డి, వై అప్పాజీ, కోటేశ్వరరావు, వెంకటేశ్వరావు, వెంకటరావు, ధనుంజయరావు, శివరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

అనిల్‌కుమార్ ప్రాణత్యాగం దళిత పల్లెవీరులకు స్ఫూర్తి



కొమ్మెర్ల అనిల్‌కుమార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దళిత బహుజన ఫ్రంట్ నాయకులు

నెహ్రూనగర్: చుండూరు దళిత పల్లెవీరుడు కొమ్మెర్ల అనిల్‌కుమార ప్రాణత్యాగం, దళిత పల్లె వీరులకు స్ఫూర్తిదాయకమని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ పేర్కొన్నారు. దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో అరండల్‌పేటలో అనిల్‌కుమార్ వర్ధంతి సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భావజాలంతో తమ జాతిని పునఃనిర్మించుకోవాలని పిలుపు నిచ్చారు. డీబీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్‌కుమార్ మాట్లాడుతూ చుండూరు దళిత ఉద్యమ స్ఫూర్తితో సుప్రీం కోర్టులో హంతకులకు శిక్షలు వేసేంతవరకు న్యాయ పోరాటం కొనసాగిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసులో దళితులకు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మేళం భాగ్యరావు, వివిధ సంఘాల నాయకులు జాలాది మోజేస్, ఇసుకపల్లి జయరాజ్, చంద్రనాయక్, భూపతి సునీల్‌కుమార్, పొందుగల ప్రకాష్, మేడిద బాబురావు, బత్తుల విల్సన్, కోడిరెక్క కోటిరత్నం, రెడ్డి రమణమ్మ, జయసుధ, సంకూరి రాజారావు పాల్గొన్నారు.

మిద్దె తోట, పెరటి తోటలపై అవగాహన సదస్సు

గుంటూరు రూరల్: రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీ మిద్దెతోట, పెరటి తోటల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగరంలోని బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం కల్యాణ మండపంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సదస్సు ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 9705383666 నంబరుకు సంప్రదించాలని ఆయన కోరారు.

■ విధులకు సకాలంలో హాజరుకండి

తెనాలిఅర్బన్: విధులకు సకాలంలో హాజరు కావాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. పాత ప్రభుత్వ వైద్యశాలలోని మూడవ పారిశుద్ధ్య డివిజన్ కార్యాలయాన్ని మంగళవారం తెల్లవారుజామున ఆయన తనిఖీ చేశారు. అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో ఎవరూ విధులకు గైర్హాజరు కావద్దని సూచించారు.